సాక్షి
చిత్తూరు
సోమవారం । 13 । మే । 2024



## దొరికింది నొక్కేసి..

గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజాప్రతినిధులు చిత్తూరులో యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. - 8లో



## పారదర్శకంగా పోలింగ్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. - 8లో



## టీడీపీ డేటా చౌర్యంపై ఫిర్యాదు

టీడీపీ 'వుయ్' యాప్ ద్వారా ప్రజల డేటా చోరీ చేసి ప్రలోభపెడుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. - 8లో

## న్యూస్‌రీల్

### జిల్లాలో ఏడు మోడల్ పోలింగ్ స్టేషన్లు



మోడల్ పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా యంత్రాంగం ఏడు నియోజకవర్గాల్లో మోడల్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసింది. మహిళలు, దివ్యాంగులు, యువకులకు ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వాటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

### పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యశిబిరాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యశిబిరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. ఆదివారం చిత్తూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద శిబిరాల్లో వైద్య సిబ్బంది ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధిగా ఉండాలని స్పష్టం చేశారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

### ఓటేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం ఓటేసేందుకు వెళ్లేవారు తప్పనిసరిగా ఏదైన ఒక కార్డు తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు ఒక గుర్తింపు కార్డును అధికారులకు చూపించాలన్నారు. ఓటరు స్లిప్పులో కేవలం పోలింగ్ కేంద్రాలు, ఓటర్లకు సంబంధించిన సమాచారం ఉంటుందని చెప్పారు. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, సర్వీస్ ఐడీ కార్డు, వైకల్య ధ్రువీకరణ పత్రం, కార్మిక శాఖ జారీచేసిన గుర్తింపుకార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీచేసిన గుర్తింపు కార్డుల్లో ఏదైన ఒకటి తీసుకెళ్లాలని సూచించారు.



తిరుపతి జిల్లా పాకాల మండలం అచ్చమ్మఅగ్రహారం పాఠశాలలో ఒకప్పటి దుస్థితి (ఫైల్)



తిరుపతి జిల్లా పాకాల మండలం అచ్చమ్మఅగ్రహారం పాఠశాలలో నేటి పరిస్థితి

# ఐదేళ్లు.. ఎన్నో మేళ్లు

సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసేందుకు దేశవిదేశాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఉద్యోగం .. ఉపాధి కోసం ఎక్కడెక్కడో స్థిరపడిన వారు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంత ప్రాంతానికి చేరుకున్నారు. ఈ ఐదేళ్లలో మారిన తమ ఊర్ల రూపురేఖలను చూసి సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ ఇంతటి అభివృద్ధిని చూడలేదని హర్షాతిరేకాలు వెలిబుచ్చుతున్నారు. తాము చదివిన బడి ఇప్పుడు కార్పొరేట్ హంగులతో కనువిందు చేయడంపై ఆనందపడుతున్నారు. పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలు ఆర్థికంగా పుంజుకోవడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సకల సేవలను ఇంటి ముంగిటకే తీసుకువచ్చిన ప్రభుత్వ పనితీరుపై అభినందనలు కురిపిస్తున్నారు.

### అభివృద్ధి అమోఘం

- ఎన్నికల వేళ సొంతూరికి వచ్చిన స్థానిక ఓటర్లు
- మారిన ఊర్లను చూసి ఆశ్చర్యం
- తాము చదివిన బడిని చూసి ఆనందం
- ఇది కదా అభివృద్ధి అంటూ అభినందనలు
- మేలు చేసిన వారికే ఓటేస్తామని స్పష్టీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : కోవిడ్ మహమ్మారి మూడేళ్ల పాటు జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఆ వైరస్ దెబ్బకు ప్రజలు భీతిల్లిపోయారు. ఇంటికి వచ్చి తమ తల్లిదండ్రులను చూసుకుందామని విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాల కోసం వెళ్లిన పిల్లలు అనుకున్నప్పటికీ సొంత గ్రామాలకు రాలేని పరిస్థితి. అలాంటి విపత్కర వేళలో ప్రస్తుత సర్కారు సహాయక చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా క్వారంటైన్‌లు ఏర్పాటు చేసింది. 35,67,999 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించింది. పాజిటివ్ కేసులకు ఆర్థిక సహాయం చేసింది. కోవిడ్ సెంటర్ల నిర్వహణకు రూ.53.8 కోట్లు వెచ్చించింది. వైద్యసిబ్బంది కోసం 20 కోట్లు ఖర్చు చేసింది. యుద్ధప్రాతిపదిక కోవిడ్ వ్యాక్సినేషన్ పూర్తి చేయించింది.ఈ క్రమంలోనే పకడ్బందీగా సంక్షేమ పథకాలు అమలు చేసింది. ఈ ఐదేళ్లలో చిత్తూరు జిల్లావ్యాప్తంగా 28,13,013 మందికి రూ.8,635.23 కోట్లు, నాన్ డీబీటీ పద్ధతిలో 5,78,015 మందికి 2,750.71 కోట్లు ఖర్చు చేసింది. తిరుపతి జిల్లాల్లో 28,50,798 మందికి డీబీటీ పద్ధతిలో 8,552.69 కోట్లు, నాన్ డీబీటీ పద్ధతిలో 34,49,551 మందికి రూ.3,401.89 కోట్లు వెచ్చించింది.



టీడీపీ పాలనలో అధ్వానంగా ముదిపల్లె దళితవాడలోని ప్రభుత్వ పాఠశాల (ఫైల్)



ప్రస్తుత సర్కారు పాలనలో నాడు-నేడు కింద తీర్చిదిద్దిన ముదిపల్లె దళితవాడలోని పాఠశాల

### బడులు మారిపోయాయ్!

ఓట్ల పండుగకు గ్రామాలకు విచ్చేసిన వారు గతంలో తాము చదివిన బడులను చూసి సర్కారు పాఠశాలలు ఇంతలా మారాయా అని ముక్కున వేలేసుకుంటున్నారు. తాము చదివే రోజుల్లో ఎలాంటి సౌకర్యాల్లేవని వారు వెల్లడిస్తున్నారు. అప్పట్లో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే ఇలాంటి వసతులు ఉండేవని గుర్తుచేసుకుంటున్నారు. పేద, మధ్యతరగతి పిల్లలకు సర్కారు బడుల్లో ఉచితంగా కార్పొరేట్ విద్యను అందివ్వడం గొప్ప విషయమని ప్రశంసిస్తున్నారు.

### వలంటీర్ల సేవలు బాగున్నాయ్!

కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీలతో సంబంధం లేకుండా ప్రస్తుత ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడం అద్భుతమని వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో తమ తల్లిదండ్రులను కంటికి రెప్పలా వలంటీర్లు కాపాడారని ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన ఇక్కడి ఓటర్లు వెల్లడిస్తున్నారు.ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వలంటీర్ వ్యవస్థను తీసుకురావడంపై అభినందనలు కురిపిస్తున్నారు. ఇలాంటి విప్లవాత్మకమైన పథకాలతో అండగా నిలిచిన వారికే తమ మద్దతని స్పష్టం చేస్తున్నారు.

### ఇంటి వద్దకే వైద్యసేవలు చక్కగున్నాయ్!

ఇంటి వద్దకే వైద్యమా ఇలాంటి సౌకర్యం ఎక్కడా లేదే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విదేశాల్లో సైతం ఇలాంటి సౌకర్యం లేదని వెల్లడిస్తున్నారు. గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళితే కనీసం మందులు కూడా ఉండేవి కావని, ఇప్పుడు ఇంటికే ఫ్యామిలీ కాన్సెప్ట్ కింద వైద్యులు వస్తున్నారని వివరిస్తున్నారు. ఇంత మేలు చేసిన ప్రస్తుతం ప్రభుత్వ పనితీరు ప్రశంసనీయమని, పేదలకు ఇలాంటి పాలకులే కావాలని స్పష్టం చేస్తున్నారు.

### చిత్తూరు జిల్లాలో సంక్షేమ సమాచారం

| | |
|---|---|
| మొత్తం జనాభా | 18,30,528 |
| కుటుంబాలు | 5,81,622 |
| లబ్ధిపొందిన ఫ్యామిలీలు | 5,38,796 |
| మేలు చేకూరిన వారు | 9,84,914 |
| డీబీటీలో ఖర్చు చేసిన మొత్తం | రూ.8,635.23 కోట్లు |
| నాన్ డీబీటీలో వెచ్చించి మొత్తం | రూ.2,750.71 కోట్లు |



టీడీపీ పాలనలో నాణ్యత లేని డెస్కులు



ప్రస్తుత ప్రభుత్వంలో నాణ్యమైన డెస్కులు

### కళ్లెదుటే అభివృద్ధి



మేము బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు స్థిరపడ్డాం . ఓటు వేసేందుకు ఆదివారం స్వగ్రామానికి చేరుకున్నారు. సుమారు రెండేళ్ల తరువాత ఊరికి వచ్చాం. గ్రామంలో అభివృద్ధి కళ్లెదుటే స్పష్టంగా కనిపిస్తోంది. మేము చదువుకున్న స్కూల్ రూపురేఖలన్నీ మారిపోయాయి. మా అమ్మ, నాన్నలను అడిగితే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి సర్టిఫికేట్లు ఇస్తున్నారని చెప్పారు. 104వాహనం ద్వారా గ్రామంలోనే వైద్యం అందుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామ సచివాలయ భవనాలన్నీ చూస్తే మా గ్రామం ఇంతలా అభివృద్ధి చెందిందా అని ఆశ్చర్యమేస్తోంది. కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన నాయకులను ఎలా మర్చిపోతాం. అలాంటి సుపరిపాలనకే ఓటేస్తాం.

– రవిశంకర్‌రెడ్డి, సుజిమ, నంగమంగళం, గుడిపాల

### ప్రభుత్వ సేవలు మరువలేం



కోవిడ్ సమయంలో మేం విదేశాల్లో చిక్కుకున్నాం. అప్పట్లో మాబంధువులకు నలుగురికి కరోనా సోకింది. ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇద్దరు కోలుకున్నారు. ఆ కష్టకాలంలో ప్రభుత్వం అందించిన సేవలు మరువలేం. ముఖ్యంగా ఆ సమయంలో వలంటీర్లు లేకపోతే మరిన్ని కష్టాలు పడేవాళ్లం . నీరు, నిత్యావసర వస్తువులు సైతం ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. మేము రాకపోయిన మా కుటుంబాలకు అండగా నిలిచారు. వారు వలంటీర్లు కాదు మా కుటుంబ సభ్యులు. మాకు మంచి చేసిన వారికి ఎన్నికల ద్వారా కృతజ్ఞతలు తెలిపేందుకే పుంగనూరుకు వచ్చాం.

– సాఫియా కౌసర్, ఎన్ఆర్ఐ, పుంగనూరు

### అభివృద్ధి చేసిన వారికే నా ఓటు



నేను బెంగుళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. ఓటు వేయడం కోసం మా ఊరికి వచ్చాను. మా గ్రామాన్ని అభివృద్ధి చేసిన వారికే నా ఓటు వేస్తాను. గతంలో నా వ్యక్తిగత కుల, ధ్రువ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అతిరిగాను. ఇప్పుడు మా పంచాయతీలో సచివాలయం ఏర్పడడంతో సేవలు తొందరగా పూర్తవుతున్నాయి. సచివాలయం వరకు వెళ్లాల్సిన అవసరం లేదు, మా ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయి. మా గ్రామానికి రోడ్డు, కాలువలు, ఇల్లు లేని వారికి సొంతిల్లు ప్రతిదీ అందుబాటులోకి వచ్చాయి. మా ఊరును అభివృద్ధి చేసిన వారికే మా ఓటు.

– వినోద్‌రెడ్డి, పాపరాజుపల్లె, పి.కొత్తకోట, పూతలపట్టు మండలం

సార్వత్రిక ఎన్నికల సమరంలో ఓటరు తీర్పు వెలువరించే రోజు వచ్చేసింది. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరముంది. చైతన్యవంతమైన పౌరులుగా సమాజంలో సగర్వంగా నిలబడేందుకు ముందడుగు వేయాల్సి ఉంది. పాలకులను నిర్దేశించే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ మేరకు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ప్రజలు ఓటేసేందుకు ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసింది. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ బందోబస్తు కల్పించింది. ఓట్ల పండుగలో అందరినీ భాగస్వామ్యం చేసేందుకు సన్నద్ధమైంది.

చిత్తూరు నియోజకవర్గంలో ఎన్నికల విధులకు హాజరైన అధికారులు, సిబ్బంది



# ఓటుకువేళాయెె!

- నేడే సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి
- సాయుధ బలగాలతో పటిష్ట బందోబస్తు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

సాక్షి చిత్తూరు /చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పోలింగ్ రోజు రానే వచ్చింది. జిల్లాలో సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆదివారం నియోజకవర్గాల వారీగా ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రిని తీసుకుని ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఇప్పటికే జిల్లాలోని మొత్తం 1,771 పోలింగ్ కేంద్రాల్లోనూ పక్కాగా మౌలిక వసతులు కల్పించారు. ఓటర్లు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు చేపట్టారు.

### పక్కాగా పర్యవేక్షణ

పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆధ్వర్యంలో పక్కాగా పర్యవేక్షించారు. బందోబస్తుకు సంబంధించి ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. కలెక్టరేట్‌లోని మానిటరింగ్ సెల్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ ద్వారా జిల్లావ్యాప్తంగా పోలింగ్ కసరత్తును సమీక్షిస్తున్నారు. మొత్తం 425 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై డేగకన్ను పెట్టారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలను, వీడియోగ్రాఫీకి చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఒడిశా, మధ్యప్రదేశ్ చెందిన పోలీసులు, కేంద్ర బలగాలతో కట్టుదిట్టంగా భద్రత కల్పించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు మైక్రో అబ్జర్వర్లను నియమించారు.

### ఓటింగ్ శాతం పెరిగేలా..

ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. 2019లో జిల్లావ్యాప్తంగా 85.02 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుత ఎన్నికల్లో మరింతగా పోలింగ్ శాతం పెంచేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలోని 15,63,911 మంది ఓటర్లలో సాధ్యమైనంత మంది పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా క్షేత్రస్థాయిలో ఇప్పటికే అవగాహన కల్పించారు.


### జిల్లా సమాచారం

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 15,63,911 |
| మొత్తం పోలింగ్ కేంద్రాలు | 1,771 |
| పోలింగ్ లొకేషన్లు | 1,267 |
| చిత్తూరు పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న అభ్యర్థులు | 19 |
| అసెంబ్లీ నియోజకవర్గాల బరిలో ఉన్న అభ్యర్థులు | 78 |
| ఎన్నికల సిబ్బంది | 12,310 |
| బ్యాలెట్ యూనిట్లు | 2,290 |
| కంట్రోల్ యూనిట్లు | 2,200 |
| వీవీప్యాట్లు | 2,471 |
| వెబ్‌కాస్టింగ్ కేంద్రాలు | 1,309 |

### ముందుగా మాక్ పోలింగ్

సార్వత్రిక ఎన్నికలకు దాదాపు ఐదు నెలలుగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేపట్టారు. అందులో భాగంగా ప్రత్యేకంగా ఓటర్ల జాబితా సవరణ, ఈవీఎంలను సిద్ధం చేయడం, ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటర్లకు సదుపాయాల కల్పన, భద్రతా ఏర్పాట్లను పూర్తి చేశారు. మొత్తం ఈ ఎన్నికల్లో 12,310 మంది అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. వీరంతా ఆదివారం రాత్రి పోలింగ్ కేంద్రాలలోనే బస చేస్తారు. ప్రిసైడింగ్ అధికారులు సోమవారం ఉదయం 5.30 గంటలకు ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలతో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. తర్వాత కంట్రోల్ యూనిట్‌లోని మెమరీని డిలీట్ చేసి, వీవీప్యాట్ కంటెయినర్ బాక్స్ నుంచి మాక్ ఓటింగ్ స్లిప్పులను తొలగిస్తారు.

### ఓటు మన బాధ్యత



ఓటు హక్కు ప్రజలందరి బాధ్యత. ఈ విషయాన్ని గుర్తించి అందరూ ఓటు వేసేందుకు ముందుకురావాలి. స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశాం. పోలింగ్ సరళిని కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తాం. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా తిరగొద్దు.

– షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది



పోలింగ్ పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ విభాగం

## ఓటింగ్ శాతం తగ్గించే కుట్ర!

- ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఎల్లో మీడియా భారీ స్కెచ్
- నేడు సోషల్ మీడియా, టీవీల వేదికగా అసత్య ప్రచారాలు చేసే అవకాశం
- పాస్‌లు లేనివారిని పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని ఎస్పీకి వినతి
- ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారమే నడుచుకోవాలంటున్న పోలీసులు




సాక్షి, తిరుపతి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఎల్లోమీడియా భారీ స్కెచ్ వేసింది. కుట్రలో భాగంగా సోమవారం పోలింగ్ రోజున సోషల్ మీడియా, టీవీల్లో పెద్ద ఎత్తున అసత్య ప్రచారాలు చేసేందుకు ప్రణాళిక రచించింది. ఈ మేరకు వారి యాజమాన్యాల నుంచి కూటమి నాయకులకు, ఎల్లో మీడియా ప్రతినిధులకు పక్కా ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. అయితే అధికారులు మాత్రం స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశించే యత్నం

ఎన్నికల నిబంధనల ప్రకారం ఇప్పటికే అధికారుల అనుమతి పొంది పాస్‌లు ఉన్న వారికి మాత్రమే పోలింగ్ కేంద్రాల పరిసరాల్లోకి అనుమతిస్తారు. కానీ మీడియా పాస్‌లు లేకపోయినా పోలింగ్ కేంద్రాలలోకి ప్రవేశించి అల్లర్లు సృష్టించేందుకు ఎల్లోమీడియా ప్రతినిధులు యత్నించనున్నట్లు తెలుస్తోంది. కుట్రలో భాగంగానే పాస్‌లు లేని వారిని సైతం పోలింగ్ కేంద్రాలలోకి అనుమతించాలని ఆదివారం జిల్లా ఎస్పీకివిన్నవించడం దీనికి బలాన్ని చేకూర్చుతోంది.

### కోడ్ అతిక్రమిస్తే చర్యలు

'ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి మీడియా పాత్రపై ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశాలు జారీచేసింది. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రతి మీడియా ప్రతినిధులకు కచ్చితంగా ఎన్నికల అధికారి ఇప్పటికే పాస్‌లు జారీచేసి ఉంటారు'అని ఎస్పీ ఎల్లో మీడియాకు తెలియజేశారు. పాస్‌లు లేకుంటే ఎట్టిపరిస్థితిలో పోలింగ్ కేంద్రాలలోకి అనుమతించమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని ఎల్లో మీడియాకు తేల్చిచెప్పినట్టు సమాచారం.

### అసత్యాల ఫోకస్‌పై దృష్టి

గత ఏడాది నుంచి ప్రభుత్వంపైనా, అధికారులపైనా విషం చిమ్ముతున్న ఎల్లో మీడియా పోలింగ్ రోజు సోమవారం జిల్లాలో ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పోలింగ్ కేంద్రాలలో వైఎస్సార్‌సీపీ దౌర్జన్యాలు చేస్తోందంటూ సోషల్ మీడియా, వారి అనుకూల టీవీ ఛానల్స్‌లో కల్పిత వీడియోలు, అసత్యాలు ప్రచారం చేసేందుకు సన్నద్ధమైంది. ఎలాగైనా ఓటర్లను ఇంటి నుంచి బయటకు రానియ్యకుండా చేసేందుకు ప్రయత్నించడంతో పాటు, పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు స్కెచ్ వేసింది. మీడియా పేరుతో పోలింగ్ కేంద్రాలలోకి ప్రవేశించాలనే ఆలోచనతో ఎల్లో మీడియా ఉన్నట్లు సమాచారం.




నాసిరకంగా జరిగిన జాతీయ రహదారి పనులు (ఫైల్)



చిత్తూరు రూరల్ మండలం అనగల్లులో నిర్మిస్తున్న పంచాయతీ, కమ్యూనిటీ భవనాలకు నాసిరకంగా వేసిన పునాది (ఫైల్)



చిత్తూరులోని మత్స్యశాఖ కార్యాలయానికి కేటాయించిన స్థలం (ఫైల్)

# దొరికింది నొక్కేసి.. యథేచ్ఛగా బొక్కేసి!

**గత టీడీపీ ప్రభుత్వంలో చిత్తూరును పచ్చనేతలు యథేచ్ఛగా ఆరగించేశారు. దొరికింది దొరికినట్లు దోచేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ జేబులు నింపుకున్నారు. బినామీ పేర్లతో సర్కారు నిధులను సొంత ఖాతాల్లోకి మళ్లిం చేసుకున్నారు. ఆవు చేలో మేస్తుంటే.. దూడ గట్టున మేస్తుందా.. అన్నట్టు అప్పటి ప్రజాప్రతినిధుల దోపిడీని అలుసుగా తీసుకుని వారి అనుచరులు సైతం రెచ్చిపోయి దందాలు సాగించారు. మొత్తంగా చిత్తూరును తమ అవినీతికి అడ్డాగా మార్చుకుని జనం సొమ్మును దిగమింగేశారు. – సాక్షి టాస్క్‌ఫోర్స్, తిరుపతి**

- చిత్తూరులో యథేచ్ఛగా టీడీపీ నేతల దందా
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా దోపిడీ
- బినామీల పేర్లతో అప్పటి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ వసూళ్లు
- రూ.424 కోట్లకు పైగా ప్రజాధనం స్వాహా చేసిన పచ్చముఠా

### నాటి డీసీసీబీ చైర్మన్ అవినీతి చిట్టా ఇదీ..

గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అవినీతికి అంతేలేదు. అత్త సొమ్ము అల్లుడి దానం అన్నట్టు సహకార బ్యాంకులోని రైతుల సొమ్మును ఇష్టారాజ్యంగా వాడుకున్నారు. 2014లో రూ.కోటి నిధులను రాష్ట్ర అభివృద్ధి పేరుతో పాలకవర్గం ఆమోదం లేకుండానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతిలో పెట్టారు. దీనిపై అప్పటి డీసీసీబీ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి రాజీనామా చేశారు. అలాగే బ్యాంకు కార్యాలయ ఆవరణలో వాస్తుదోషం పేరిట మరమ్మతులకు రూ.25లక్షలు దుర్వినియోగం చేశారు. అలాగే బ్యాంకు పాత భవనాన్ని అప్పటి ఎమ్మెల్సీ దొరబాబుకు అప్పగించేశారు. తన సొంత మెహర్బానీ కోసం రూ.లక్ష వెచ్చించి ఆ భవనానికి మరమ్మతులు కూడా చేయించారు. అలాగే రూ.కోట్ల బ్యాంకు రుణాలను బినామీ పేర్లతో టీడీపీ నేతలు, వారి అనుచరులకు మంజూరు చేయించారు. తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకుండా రెన్యూవల్ చేస్తూ నిధులను స్వాహా చేసేశారు. ఈ అవకతవకలు బయటపడకుండా తన బంధువైన చార్టెడ్ అకౌంటెంట్లు నరేందర్‌రెడ్డి, వెంకటాచలపతి ద్వారా ఆడిటింగ్ చేయించి రికార్డులు సిద్ధం చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఈ భవనాన్నే అప్పట్లో ఎమ్మెల్సీకి లీజుకు కట్టబెట్టింది

### అప్పటి జెడ్పీ చైర్మన్ బినామీ దందా ఇదీ..

టీడీపీ హయాంలో అప్పటి జెడ్పీ చైర్మన్ గీర్వాణి, ఆమె భర్త చంద్రప్రకాష్ బినామీ పేర్లతో టెండర్లు దక్కించుకుని కాంట్రాక్టు పనులు చేసేవారు. బంగారుపాళెం నుంచి గుడిపాల మీదుగా తమిళనాడు సరిహద్దు వరకు సుమారు 35 కి.మీ మేర రూ.306 కోట్లతో జాతీయరహదారి విస్తరణ పనులు జరిగాయి. ఈ పనులను దక్కించుకునేందు నాడు ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. అయితే అప్పటి జెడ్పీ చైర్మన్ గీర్వాణి అధికార బలంతో టెండర్ సొంతం చేసుకున్నారు. అలాగే చిత్తూరు నగరంలో రూ.2.80 కోట్లతో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ సమావేశ భవన నిర్మాణ పనులను కూడా ఆ టీడీపీ మహిళా నేత పేరుతో దక్కించుకుని పనులు చేపట్టారు. ఈ రెండు పనుల్లో ఎక్కడా నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా క్వాలిటీ కంట్రోల్ అధికారులు కన్నెత్తి చూసే సాహసం చేయలేకపోయారు. జాతీయరహదారి పనులు ఆలస్యం అయ్యాయని అప్పటి కలెక్టర్ ప్రద్యుమ్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం ఇందుకు నిదర్శనం. ఇదిలా ఉంటే జెడ్పీలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించటంలో భారీగా మామూళ్లు వసూలు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలోనే బీఎస్‌ఆర్‌పేట, అనగల్లు, అనంతాపురం, ముత్తుకూరు, ముత్తిరేవులు పరిసర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి జెడ్పీ చైర్మన్ గీర్వాణి భర్త చంద్రప్రకాష్, అప్పటి ఎంపీపీ సునీత భర్త జయచంద్రనాయుడు సహకారంతో స్థానిక టీడీపీ నాయకులు విచ్చలవిడిగా ఇసుకను తవ్వి బెంగుళూరుకు తరలించి సొమ్ముచేసుకున్నారు. అదే అధికారిక రీచ్‌ల నుంచి స్థానికులు ఇసుకను తీసుకెళ్లాలంటే ట్రాక్టర్‌కు రూ.200 చొప్పున వసూలు చేశారు.



చిత్తూరు మార్కెట్ (ఇన్‌సెట్) రూ.100 చార్జీకి రూ.1000 వసూలు చేసినట్టు రశీదు (ఫైల్)

### అప్పటి ఎమ్మెల్యే అక్రమాల పట్టీ ఇదీ..

చిత్తూరు నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్, కొంగారెడ్డిపల్లి, సంతపేట, గిరింపేటలో ఉన్న మార్కెట్లకు గుడిపాల, యాదమరి, తవణంపల్లి, చిత్తూరు రూరల్, ఐరాల, పూతలపట్టు, పెనుమూరు, జీడీ నెల్లూరు మండలాల నుంచి వేలాది మంది రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయించి జీవనం సాగిస్తుంటారు. అదే విధంగా 2వేల మందికిపైగా స్థానికులు తోపుడు బండ్లపై పానీపూరీ, బండ్లు, చిన్న చిన్న పరికరాలు, ఆటవస్తువులు విక్రయించగా వచ్చిన ఆదాయంతో పొట్టనింపుకుంటుంటారు. నిబంధనల ప్రకారం మార్కెట్ గేటు కింద చిరు వ్యాపారుల నుంచి రూ.10 లేదా రూ.20 మించి వసూలు చేయటానికి వీల్లేదు. అయితే నాటి ఎమ్మెల్యే సత్యప్రభ అనుచరులు చలపతి, శ్రీధర్ అధికార అండతో రూ.35 నుంచి రూ.2,500 వరకు దౌర్జన్యంగా వసూలు చేసుకుని స్వాహా చేశారు. అలాగే నీరు–చెట్టు పథకాన్ని సైతం అప్పటి ఎమ్మెల్యే సత్యప్రభ తన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 2015 నుంచి 2018 వరకు మొత్తం 371 పనులకు రూ.16 కోట్లు మంజూరయ్యాయి. ఆయా పనులను తూతూమంత్రంగా పూర్తి చేసి, తన సొంతానికి నిధులు వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇరువారం చెరువులో పూడిక తీత పనుల కోసం రూ.20లక్షలు మంజూరు చేసుకున్నారు. చెరువులో పూడిక తీసిన మట్టిని ఆమె సొంత భూమికి తోలుకుని లేఅవుట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. నగరంలోని కట్టమంచి చెరువు పనుల పేరుతో భారీగా నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారు. గుడిపాల మండలంలో సుమారు రూ.7 కోట్లతో 40 చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టి నిధులు స్వాహా చేశారు. మత్స్యశాఖ కార్యాలయ స్థలం కబ్జాకు యత్నించారు.

### తమ్ముళ్ల దందా లెక్క ఇదీ..

చిత్తూరు నగర పరిధిలో రూ. 25 కోట్లు (అప్పట్లో) విలువ చేసే ఏపీఐఐసీకి చెందిన ఎకరం భూమిని టీడీపీకి చెందిన లోకనాథం నాయుడు ఆక్రమించుకున్నారు. ఆ భూమిని ఇప్పుడు తన కల్యాణ మండపం పార్కింగ్ కోసం వినియోగించుకుంటున్నారు. రూరల్ మండల పరిధిలో టీడీపీ హయాంలో రూ.82 కోట్లతో చెక్‌డ్యామ్‌లు, పంట సంజీవిని పేరుతో నీటి కుంటలు, ప్రతి పంచాయతీకి డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేశారు. వీటిన్నింటి పనులను టీడీపీ కార్యకర్తలే చేపట్టారు. మండలంలో నిర్మించిన 25 చెక్‌డ్యాం పనుల్లో ఎక్కడా నాణ్యత పాటించలేదు. అదే విధంగా 17 డంపింగ్ యార్డులు నిర్మిస్తే.. కొలతలు తగ్గించినిధులు స్వాహా చేశారు. ఇకపోతే పంట సంజీవిని పేరుతో తీసిన కుంటల్లో భారీగా నిధులు కాజేశారు. రూ.19.5 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తే ఎక్కడా నాణ్యత లేదు. ఇదిలా ఉంటే టీడీపీ గుడిపాలలో మండల అధ్యక్షుడు కమలేష్‌బాబు రూ.4 కోట్ల జెడ్పీ నిధులతో రోడ్లు నిర్మించారు. ఇందులో రూ.70లక్షల వరకు స్వాహా చేసినట్లు అధికారులు నివేదికలు ఇచ్చారు. మండలంలో 200 మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులను కూడా టీడీపీ నేతలు తినేయడం గమనార్హం.

**టీడీపీ హయాంలో చిత్తూరులో జరిగిన అవినీతి పద్దు ఇదీ...**

| | | |
|---|---|---|
| అభివృద్ధి పేరిట స్వాహా చేసింది | : | రూ.207 కోట్లు |
| రైతు రుణాల పేరిట ఆరగించింది | : | రూ.120 కోట్లు |
| మార్కెట్ గేటు వసూళ్లు (ఏడాదికి) | : | రూ. 3.60 కోట్లు |
| నీరు–చెట్టు పథకం కింద తినేసింది | : | రూ. 15 కోట్లు |
| ఉపాధి నిధుల్లో జేబులో వేసుకుంది | : | రూ. 45 కోట్లు |
| ఇసుక అక్రమ రవాణా ద్వారా (నెలకు) | : | రూ. 5.50 కోట్లు |
| కబ్జా చేసిన భూముల విలువ | : | రూ. 28 కోట్లు |
| మొత్తం | : | రూ.424.10 కోట్లు |



చిత్తూరు రూరల్ మండలం ఎగువ చెరువులో రూ.20లక్షలతో నీరు– చెట్టు కింద చేపట్టిన చెరువు కట్టకు బీటలు (ఫైల్)



## పోలింగ్ వేళ.. కరెంట్ కంట్రోల్ రూమ్

**చిత్తూరు కార్పొరేషన్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో 2,350 మంది ఉద్యోగులు విధి నిర్వహణలో అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

| ప్రాంతం | మండలం | కంట్రోల్ రూమ్ నంబరు |
|---|---|---|
| తిరుపతి – | తిరుపతి అర్బన్, రూరల్, రేణిగుంట | 9440817413 |
| చంద్రగిరి – | చంద్రగిరి, పాకాల, కేవీబీపురం | 9440817414 |
| పుత్తూరు – | ఆర్‌సీపురం, జీడీనెల్లూరు, క్వారేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, నారాయణవనం, నాగలాపురం,పిచ్చాటూరు, వరదయ్యపాలెం,నగరి, నింద్ర విజయపురం, వడమాలపేట | 9440817421 |
| పీలేరు – | ఎర్రవారిపాళెం, చిన్నగొట్టిగల్లు | 9491054705 |
| శ్రీకాళహస్తి – | ఏర్పేడు, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ | 9440817414 |
| చిత్తూరు – | జీడీనెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు, గుడిపాల | 9440817419 |
| పూతలపట్టు – | ఐరాల,తవణంపల్లె,బంగారుపాళ్యం, యాదమరి, | 9491052934 |
| మదనపల్లె – | నిమ్మనపల్లె,రామసముద్రం ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దపంజాణి, పీటీఎం, బి.కొత్తకోట, కురబలకోట,గుర్రంకొండ | 7382623216 |
| కలికిరి – | కలకడ, కేవీపల్లె | 9491054705 |
| పలమనేరు – | పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట ,సోమల, రొంపిచెర్ల, కల్లూరు చౌడేపల్లె, పుంగనూరు, సదుం, | 8074051992 |

## పారదర్శకంగా పోలింగ్

- ప్రజల పక్షాన పనిచేస్తాం
- జిల్లాలో సెక్షన్ 144 అమలు
- కేంద్ర బలగాలతో బందోబస్తు
- ఎస్పీ మణికంఠ

**చిత్తూరు అర్బన్:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయపార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు సహకరించాలని ఎస్పీ మణికంఠ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా పోలింగ్ నేపథ్యంలో తీసుకున్న భద్రతాపరమైన అంశాలు, ఇతర విషయాలపై 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

- ఓటు హక్కు లేనివాళ్లు వెంటనే వారి సొంత ప్రాంతానికి వెళ్లిపోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ ఉండాల్సి వస్తే ఇంట్లోనే ఉండాలి. పోలింగ్ కేంద్రాల వద్దకు రాకూడదు. ఒక గ్రామంలోని ఓటరు, మరో గ్రామానికి కూడా వెళ్లకూడదు. ఓటర్లు, పోలింగ్ సిబ్బంది తప్ప.. బూత్‌కు వంద మీటర్ల పరిధిలో ఎవరూ ఉండటానికి వీల్లేదు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే సహించే ప్రసక్తే లేదు. దీనిపై ఇప్పటికే పోలీసులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. బయటివాళ్లు ఎక్కడైనా ఉంటే మాకు సమాచారం ఇవ్వండి. చర్యలు తీసుకుంటాం.
- ప్రతీ ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకున్నాం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 వేల మంది పోలీసులతో బందోబస్తు పెట్టాం. ప్రతీ నియోజకవర్గంలో ఓ ఏఎస్పీ స్థాయి అధికారి భద్రతను పర్యవేక్షిస్తారు. అలాగే ఓ డీఎస్పీ, కేంద్ర బలగాలు ఉంటాయి. 236 మొబైల్ పార్టీలు నిత్యం భద్రతను పర్యవేక్షిస్తాయి. కేంద్రం నుంచి వచ్చిన బలగాలతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక పోలీసులను ఈ ఎన్నికల విధులకు వినియోగించుకుంటున్నాం. పోలింగ్ పూర్తయ్యేంత వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అభ్యర్థి వెంట కాన్వాయ్‌గా వెళ్లడం నిషేధం. ఎక్కడైనా ఇబ్బందులు వస్తే డయల్–100, పోలీసు వాట్సాప్–9440900005 నంబర్లకు సమాచారం ఇవ్వండి.
- ఎన్నికల్లో పోలీసుశాఖ ఒకరికి ఫేవర్‌గా పనిచేయదు. ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తాం. మా వాళ్ల పనితీరుపై కూడా నాకు ఫీడ్ బ్యాక్ ఉంటుంది. పారదర్శకంగా, నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేశాం. చాలా వరకు బయటివాళ్లకే భద్రతా విధులు వేశాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై మరింత నిఘా ఉంటుంది. అక్కడ సమస్యలు పునరావృతం కాకుండా చూస్తాం.



చిత్తూరులో అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ

## టీడీపీ డేటా చౌర్యంపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న లీగల్ సెల్ అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి

**చిత్తూరు కార్పొరేషన్:** టీడీపీ నాయకులు 'వ్యయ్' యాప్ ద్వారా ఓటర్లను ప్రలోభపెడుతున్నారి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఈ మేరకు లీగల్ సెల్ సభ్యులతో కిసి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ యాప్‌లో ఓటరు పేరు, ఊరు, వీధి పేరు, కులం, ఏ పార్టీ మద్దతుదారుడు అనే వివరాలు ఉన్నాయన్నారు. డేటాచోరీ చేసి టీడీపీకి ఓట్లు వేయించడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందులో ఓటర్ స్లిప్స్, బార్‌కోడ్ ఆప్షన్‌లు ఉన్నాయన్నారు. టీడీపీకి ఓటు వేయకపోతే ఓటు తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. తటస్థులను టీడీపీ పక్కకు తిప్పుకోవడానికి సంప్రదింపులు చేస్తున్నారన్నారు. ప్రజల డేటా చోరీ చేయడమే కాకుండ వారిని ప్రలోభాలకు గురిచేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తున్నందున వారిపై చర్యలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యులు సురేష్‌రెడ్డి, సుగణశేఖర్‌రెడ్డి, ఆంజాద్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పచ్చనేతల ప్రకోపం

**– ఓటర్లను భయపెట్టేందుకు కుట్రలు**

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం జరగనున్న నేపథ్యంలో ఓటర్లను భయపెట్టేందుకు టీడీపీ నేతలు కుట్రలకు పాల్పడుతున్నారు. చిత్తూరు మండలంలో గత మూడు రోజులుగా టీడీపీ నాయకులు డబ్బులు పంచడమే కాకుండా, ప్రతి ఇంటా బియ్యం, కుంకమం చల్లుతున్నారు. దీంతో పలుచోట్ల స్థానికులు వాగ్వాదానికి సైతం దిగారు. ఓట్ల కోసం ఇలాంటి పనులు చేయడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

- చిత్తూరు జిల్లా వెంగంపల్లిలో ఘటన
- మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

**తవణంపల్లి :** గజరాజు దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన తవణంపల్లి మండలం వెంగంపల్లి గ్రామంలో జరిగింది. జిల్లా అటవీశాఖాధికారి చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం... వెంగంపల్లి ఎస్టీ కాలనీకి చెందిన చిన్నయ్య (50) ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి ఇంటికి సమీపంలోని మామిడి తోటలోకి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ కుక్కలు అరుస్తుండటంతో అటువైపు వెళ్లాడు. చీకట్లో ఉన్న మదపుటేనుగు ఒక్కసారిగా అతనిపై దాడి చేసింది. దంతంతో ఛాతీపై పొడవడంతో చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లారిన తర్వాత అటువైపు వెళ్లిన స్థానికులు నిర్జీవంగా పడి ఉన్న చిన్నయ్య, ఆ పక్కనే ఏనుగు పాదాల గుర్తులను గమనించి అటవీశాఖాధికారులు, తవణంపల్లి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఒంటరి ఏనుగు దంతంతో ఛాతీపై పొడవడం వల్లే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం చిన్నయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య పద్మకు జిల్లా అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అంత్యక్రియల కోసం మరో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.



మామిడితోటలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు, అటవీశాఖాధికారులు, స్థానికులు



ఏనుగుదాడిలో మృతి చెందిన చిన్నయ్య



మృతుడి భార్యకు రూ.5 లక్షలు చెక్కును అందజేస్తున్న జిల్లా అటవీశాఖాధికారి చైతన్యకుమార్‌రెడ్డి